క్లుప్తంగా

లాన్ టెన్నిస్‌లో రోహిత్ ప్రతిభ



రోహిత్

నాగమల్లితోట జంక్షన్: హర్యానాలోని గుర్గాంలో ఈ నెల 17 నుంచి 24 వరకు జరిగిన జాతీయస్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో దుంపల రోహిత్ అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరచి ద్వితీయస్థానం సాధించాడు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రోహిత్‌కు సేవ్ ద పీపుల్ ట్రస్ట్ నిధులు అందజేసి టోర్నీకి వెళ్లేందుకు సహకరించింది. రోహిత్ తండ్రి డాక్టర్ లింగరాజు కాకినాడ జేఎన్టీయూకేలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రోహిత్‌కు శుక్రవారం ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పి.రామ్‌కుమార్, ఆస్ట్రేలియన్ కోచ్ టోడ్‌క్లార్క్, పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ రబ్బాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. టోడ్‌క్లార్క్ వేసవిలో హర్యానాలో జరిగే ప్రత్యేక వేసవి శిబిరానికి టోడ్‌క్లార్క్ రోహిత్‌ను ఆహ్వానించారు.

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

బోట్‌క్లబ్: నాలుగేళ్ల క్రితం రాహుల్ గాంధీ బహిరంగంగా తెలి గాండ్ల తెలుకులను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలకు కోర్టు విధించిన శిక్షను స్వాగతిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి గంగాధర్ అన్నారు. కాకినాడలో ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కోర్టు నిర్ణయం దేశంలోని చట్టం, దేశ రాజ్యాంగం అత్యున్నతమైనదని దాని దృష్టిలో దేశంలోని పౌరులందరూ సమానమని చూపిస్తోందన్నారు. ఎంత పెద్ద వ్యక్తి అయినా నేరం చేస్తే కచ్చితంగా శిక్ష పడుతుందని కోర్టు నిర్ణయం రుజువు చేసిందన్నారు. మన సమాజంపై రాహుల్ గాంధీ చేసిన అభ్యంతరకరమైన విషయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఓబీసీ మోర్చా నాయకులు శ్రీనివాస్‌రాజు, గోవిందరాజులు, వేగి భద్రం, త్రినాథ్‌వర్మ, పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

కరప: సచివాలయంలో ఏర్పాటు చేసిన సంచార ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొమ్మిడి నయోమి అన్నారు. ఉప్పలంక సచివాలయంలో శుక్రవారం సంచార ఆధార్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామంలో 52 మంది వచ్చి ఆధార్ సేవలను వినియోగించుకున్నారు. డిజిటల్ అసిస్టెంట్ సూరాడ అబ్బాయి, వెల్ఫేర్ అసిస్టెంట్ గూడాల అపర్ణ, మహిళా పోలీసు పి.జయశ్రీ తదితరులు ఆధార్ సేవలు అందించారు. గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్ ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



ఉమ్రా యాత్రకు వెళ్ల వచ్చినవారిని సన్మానిస్తున్న ముస్లింలు

కాకినాడ రూరల్: నెలవంక కనిపించడంతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాస ఉపవాస ప్రార్థనలు ప్రారంభించారు. గంగనాపల్లి గ్రామంలోని మస్జీద్ ఏ గౌస్ ఆజాద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రార్థనల్లో జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి కరీం బాషా ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల ఉమ్రా యాత్రకు వెళ్లి వచ్చిన మత పెద్దలను సన్మానించారు. ఇమామ్ ఎండీ షహబాజ్, ప్రెసిడెంట్ అల్తాఫ్ మహమ్మద్, ఎండీ జాఫర్, ఎండీ చాంద్‌బాషా, నవాజ్, జహీర్ గౌస్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

కాకినాడ సిటీ: పెదపూడి మండలం ఏపీ త్రయంలో నిర్మాణంలో ఉన్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లను జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి బి సుధాకర్ పట్నాయక్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలపై సుధాకర్ పట్నాయక్ మాట్లాడారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజినీర్ సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

సంపదను వృద్ధి చేయండి

కరప: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త నుంచి సంపద (ఎస్‌డబ్ల్యూపీసీ) తయారీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేయాలని డీఎల్‌పీఓ వై.అమ్మాజీ సూచించారు. నడకుదురులో శుక్రవారం ఆమె పర్యటించి ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించి, పంచాయతీ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలని, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి స్వచ్ఛ గ్రామాలుగా రూపొందించాలన్నారు. గ్రామ కార్యదర్శి పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జ్యోతిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలకు కాసుల గలగల

- లీజులకు ఇవ్వడంతో కబ్జాలకు అడ్డుకట్ట
- సత్రాలు, ఆలయాలకు భారీగా ఆదాయం



పైడా చలమయ్య శ్రీనివాస కల్యాణమండపానికి చెందిన రామారావుపేటలోని ఖాళీస్థలం

బోట్‌క్లబ్: దేవదాయశాఖ పరిధిలో సత్రాలు, ఆలయాలు ఆదాయం పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆలయాలు, సత్రాలకు ఉన్న ఖాళీ స్థలాలను 11 ఏళ్ల లీజు ప్రతిపాదికన ఇవ్వడంతో వాటికి ఆర్థిక పరిపుష్టి లభించనుంది. ఇప్పటి వరకూ నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలను ఎవరో ఒకరు కబ్జా చేయడం, వాటిని ఖాళీ చేయించేందుకు సంబంధిత ఈఓలు అవస్థలు పడడం జరిగేది. ఇకపై ఆ ఇబ్బందులు లేకుండా, ఆదాయం కూడా సమకూర్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. నగరంలో దేవదాయశాఖ కార్యాలయం పక్కన ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న ముల్లుకుట్ల అచ్యుతరామయ్య ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు సంబంధించిన ఖాళీస్థలంలో తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసేకొనేందుకు లీజు వేలం నిర్వహించగా 13 షాపులకు నెలకు రూ.రెండు లక్షలు ఆదాయం వచ్చింది. ఇప్పటి వరకూ ఈ స్థలం ఖాళీగానే ఉండేది. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయానికి వార్ఫురోడ్డులో వెయ్యి గజాల ఖాళీ స్థలం ఉంది. ఇది కూడా 11 ఏళ్ల లీజు వేలానికి ఇచ్చేందుకు దేవాదాయశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ స్థలం లీజుకు ఇస్తే ఆయా ఆలయాలకు నెలకు రూ. 2 లక్షలు వరకూ ఆదాయం వస్తుందని అధికారులు అంచనాకు వచ్చారు. లీజు వేలం పూర్తయితే ఆదాయం పెరగడంతో భక్తులకు మెరుగైన సదుపాయాలతో పాటు దేవస్థానం సిబ్బందికి జీతాల సమస్య తీరుతుంది. నగరంలో పైడా చలమయ్య శ్రీనివాస కల్యాణ మండపానికి చెందిన స్థలం స్థానిక రామారావుపేటలో ఉంది. ఇటీవల వేలం నిర్వహించగా నెలకు రూ.4 లక్షల ఆదాయం వచ్చింది. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయం పక్కన ఉన్న శ్రీరామచంద్రమూర్తి దేవస్థానానికి ఎదురుగా 496 గజాల ఖాళీ స్థలం ఉంది. ఇది వేలం వేయగా ఏడాదికి రూ. 11.52 లక్షల ఆదాయం సమకూరింది. ఇలా నగరంలో 88 పైగా ఆలయాలు, సత్రాలకు సంబంధించిన ఖాళీ స్థలాలు దేవాదాయశాఖ అధికారులు గుర్తించారు. వీటిని 11 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



సూర్యారావుపేటలోని శ్రీరామచంద్రమూర్తి దేవస్థానం ఖాళీస్థలం

అన్నదాన సమాజం దుకాణాల లీజు వేలం

బోట్‌క్లబ్: స్థానిక కోకనాడ అన్నదాన సమాజంలో శుక్రవారం సమాజానికి చెందిన షాపులకు దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో లీజు వేలం నిర్వహించారు. పది దుకాయాలకు లీజు వేలం నిర్వహించగా ఏడు దుకాణాలకు గతం కంటే ఎక్కువ లీజు రావడంతో లీజు వేలం ఖరారు చేశారు. మిగిలిన మూడు షాపులకు సరైన లీజు రాకపోవడంతో పాట వాయిదా వేసినట్లు ఈఓ శివబాబు తెలిపారు. అన్నదాన సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదాయం పెంచడమే లక్ష్యం



నిరుపయోగంగా ఉన్న సత్రాలు, ఆలయాల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకొంటున్నాం. ఇప్పటికే నగరంలో ఉన్న అన్ని ఖాళీ స్థలాలను పరిశీలించాం. పేపరు ప్రకటన అనంతరం దశల వారీగా అన్నింటికీ లీజు వేలం నిర్వహిస్తాం. కొన్ని స్థలాలపై కోర్టు కేసులు ఉన్నాయి. కేసులు పూర్తయిన అనంతరం వాటిని లీజు వేలం నిర్వహిస్తాం.

– పులి నారాయమణమూర్తి, జిల్లా దేవదాయశాఖాధికారి

ప్రభుత్వ నిర్ణయం సరైనదే



మా దేవాలయానికి సంబంధించిన స్థలం ఎప్పటి నుండో ఖాళీగా ఉంది. తరచూ ఈ స్థలం కబ్జాకు గురికాకుండా చూసేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. గత ఏడాది లీజు వేలం నిర్వహించగా నెలకు రూ.96 వేల ఆదాయం వచ్చింది. దీంతో ఆలయానికి ఆదాయం సమకూరుతోంది. సంవత్సరానికి 11.52 లక్షల ఆదాయం వస్తోంది.

– పైడా రామకృష్ణారావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి దేవస్థానం

అంగన్‌వాడీ స్టాక్ పాయింట్లకు పాల సరఫరా



కాకినాడ అర్బన్ ప్రాజెక్టుకు వచ్చిన పాలను దింపుతున్న సిబ్బంది

కాకినాడ సిటీ: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు చేరుతున్నాయని ఐసీడీఎస్ పీఓ కె.ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. కొన్ని ప్రాజెక్టుల్లోని కొన్ని సెంటర్లకు పాలు సరఫరా చేయాల్సి ఉందని, బెంగుళూరు నుంచి పాలు తీసుకురావడం వల్ల కొంత ఆలస్యం అయ్యిందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా కొనసాగుతుందన్నారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సమష్టి కృషితో క్షయ రహిత సమాజం



క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



కరపలో టీబీ నుంచి విముక్తి పొందిన వారిని సత్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌నాయక్



వేళంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

కరప: క్షయ రహిత సమాజ స్థాపనకు సమష్టికృషి అవసరమని డివిజనల్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా నిక్షయ మిత్ర పేరిట ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయ నివారణకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న మందుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్షయ అనుమానితులను దగ్గరలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయినవారికి ఆరు నెలలు ఉచిత చికిత్స అందించాలన్నారు. ఈ సందర్భంగా డాట్స్ కేంద్రం ద్వారా వైద్యసేవలుపొంది టీబీ నుంచి విముక్తిపొందిన వ్యక్తులతో వారి అనుభవాలను చెప్పించారు. టీబీ నుంచి విముక్తి పొందిన ఇద్దరిని పీహెచ్‌సీ సిబ్బందితో కలసి సత్కరించి, పండ్లు అందజేశారు. క్షయ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ వివరించారు. వేళంగి పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో డాక్టర్ ఎంకే సౌజన్య మాట్లాడుతూ క్షయ నివారించగలిగేదేనని ప్రజలకు తెలియచెప్పాలన్నారు. కరప, వేళంగి గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో కలసి 'మన పంతం–టీబీ అంతం' అంటూ నినాదాలు చేస్తూ క్షయ నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఎ.ఆశ, ఆయా పీహెచ్‌సీల వైద్యసిబ్బంది వై.రత్నకుమారి, డి.గంగాధర్, బీఎల్‌జీఎస్ కుమార్, రాధాకృష్ణ, సత్యనారాయణమ్మ, జి.గోవిందరాజు, డేవిడ్, కేవీ రమణమూర్తి, సూర్యనారాయణ, బీఆర్‌వీ చౌదరి, నక్కా రమేష్, ఎస్‌కే నూర్, ఎన్.భాస్కర్, ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో..

కాకినాడ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో శుక్రవారం క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా క్షయ నివారణ అధికారి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతా దేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ నుంచి బాలాజీచెరువు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారంగా ఏర్పడి క్షయనివారణపై నినాదాలు చేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఆరుగురి ఎంపిక



తోట లోకేష్, అరట్లకట్ట



నక్కా దుర్గాగౌతమ్, అరట్లకట్ట



టేకుమూడి గౌతమ్‌సాయి, అరట్లకట్ట



సాదే షర్లీ, కరప



పెనుమళ్ల కనకదుర్గనాగేంద్ర, గురజనాపల్లి



కర్నాసుల సాయిశ్రీసాదామిని లక్ష్మీకృష్ణ, వేళంగి

కరప: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎం) స్కాలర్‌షిప్‌కు మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు. అరట్లకట్ట హైస్కూలు నుంచి తోట లోకేష్, నక్కా దుర్గాగౌతమ్, టేకుమూడి గౌతమ్ సాయి ఎంపికైనట్టు హెచ్ఎం ప్రత్తి సత్యనారాయణ, కరప హైస్కూలు నుంచి సాదే షర్లీ, గురజనాపల్లి హైస్కూలు నుంచి పెనుమళ్ల కనకదుర్గ నాగేంద్ర , వేళంగి హైస్కూళ్ల నుంచి కర్నాసుల సాయిశ్రీ సౌదామని లక్ష్మీకృష్ణ ఎంపికైనట్టు హెచ్ఎంలు బీవీవీ ప్రసాదరావు, యు.లీలామెహర్, కె.భారతి తెలిపారు. గత ఏడాది జరిగిన ఎంపిక పరీక్షలో తమ పాఠశాలల విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు ఎంపికయ్యారన్నారు. ఏడాదికి రూ.12 వేలు వంతున 9, 10 తరగతులలోను ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ఈ ఉపకార వేతనం అందజేస్తారన్నారు. విద్యార్థులను జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, హైస్కూళ్ల హెచ్ఎంలు అభినందించారు.

అలరించిన సిక్కిల్ గాత్ర కచేరి



గాత్ర కచేరీలో కృతులు ఆలపిస్తున్న సిక్కిల్ గురుచరణ్ తదితరులు

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు సిక్కిల్ గురుచరణ్ ఆలపించిన కృతులు ఆహూతులకు వీనుల విందు చేశాయి. సరస్వతీ గానసభ 19వ వార్షిక సంగీత, నృత్య నాటకోత్సవాలు శుక్రవారం సాయంత్రం స్థానిక సూర్యకళామందిర్‌లో ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు సిక్కిల్ గురుచరణ్ (చెన్నై) ఏర్పాటు చేసిన గాత్ర కచేరీ అలరించింది. వీరు ఖమాస్ రాగంలో 'సాంబశివ యనవే..', మాయమాళవగౌళ రాగంలో 'తులసీదళంచే..' తదితర కృతులు ఆలపించారు. అలాగే అన్నమయ్య, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్ తదితర వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించారు. వీరికి వయోలిన్ ఎం.శ్యామనీలాద్రి రావు, మృదంగం ఎం.ఏడుకొండలు, ఘటం ఎస్.హనుమంతరావులు సంగీత సహకారం అందజేశారు. 26వ తేదీ వరకు వేడుకలు సాగుతాయని, కళాభిమానులు ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి కోరారు. గానసభ అధ్యక్షులు ఆంజనేయమూర్తి, కార్యదర్శి పి.రామకృష్ణ,వెంకట్రావు తదితరులు హాజరయ్యారు.

కాంగ్రెస్ కార్యాలయానికి పన్ను నోటీసు

కాకినాడ: పన్ను బకాయిలు చెల్లించాలంటూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి నగరపాలక సంస్థ నోటీసులు జారీ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్న నేపథ్యంలో మొండి బకాయిలు వసూలు చేసే క్రమంలో అధికారులు పార్టీ వర్గాలకు ఈ నోటీసులు ఇచ్చారు. రూ.12 లక్షల వరకు బకాయి ఉండగా సుమారు రూ.31 లక్షలు వరకు పెనాల్టీ పడిందని కాంగ్రెస్ వర్గాలు నిరసన వ్యక్తం చేశాయి. ఎన్నో ఏళ్లుగా పన్నులు కట్టకపోవడం వల్లే అపరాధ రుసుం పెరిగిందని కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. కాగా దీనిపై శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే నాయకుల సహకారంతో బకాయి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కేసీబీఎస్‌తో మెరుగైన సేవలు

- చైర్మన్ కోనూరి సత్యనారాయణమూర్తి
- 2023–24 బడ్జెట్ సమావేశం



సమావేశాన్ని ప్రారంభిస్తున్న కేసీబీఎస్ అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి తదితరులు

బోట్‌క్లబ్: ఖాతాదారుల సహకారంతో శతవసంతంలోకి అడుగుపెట్టిన ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ద్వారా మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని కేసీబీఎస్ అధ్యక్షుడు కోనూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం జరిగిన కేసీబీఎస్ 2023–24 బడ్జెట్ సమావేశాన్ని చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు, ఇతర సభ్యులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల కన్నా మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సహకార స్ఫూర్తితో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తున్న కేసీబీఎస్‌కు ఖాతాదారుల మన్ననల వల్లే శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తొలుత మేనేజర్ చీమలకొండ గంగాధరం బడ్జెట్ ప్రతిపాదనలను సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సంస్థ చార్టెడ్ అకౌంటెంట్ డీపీఆర్ స్వామి సభ్యుల ఆదాయపన్నుకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. తొలుత కేసీబీఎస్ మాజీ అధ్యక్షుడు కోనూరి కృష్ణారావు, కోనూరి యదుసూర్య చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బాలయోగి, కోనూరి లక్ష్మీప్రసన్న లావణ్య, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం

- విజయదశమి నాటికి పూర్తిచేసేలా ఏర్పాట్లు
- రూ. 25 లక్షలు ప్రకటించిన జొన్నాడ



కార్యక్రమంలో పాల్గొన్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళా దీప్తి, జొన్నాడ చినబాబు, నాగేశ్వరి దంపతులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): చారిత్రాత్మకమైన సంతచెరువు జమ్మిచెట్టు సెంటర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. రూ.1.5 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ పనులకు త్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు–నాగేశ్వరి దంపతులు భూమి పూజ చేశారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగర ప్రముఖులు హాజరయ్యారు. చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ఆలయ నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నగరంలోని ఆలయాల అభివృద్ధికి తోడ్పతున్నారన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా జొన్నాడ చినబాబు రూ.25 లక్షలు ప్రకటించారు. విజయదశమి నాటికి పనులు పూర్తిచేసి దశమి ఉత్సవాలు నిర్వహించాలని తమ ఆకాంక్ష అన్నారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), వైఎస్సార్ సీపీ యువ నాయకులు మల్లిపాముల గణపతి, కంపర అప్పారావు, బి.అజయ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొలగాని దుర్గాప్రసాద్, ఐ.శ్రీను, ఇనుకొండ పట్టాభిరామయ్య, త్రిపురసుందరి ఆలయకమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన బాబ్జీ, కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు, స్థపతి శ్రీనివాసాచార్యులు, డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ కె.నాగేశ్వరరావు, ఈవో విజయభాస్కరరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాయుడు వెంకటదుర్గాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షలు మానుకోవాలి



వ్యక్తిగత సాధింపు మానుకోవాలని ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కాకినాడ సిటీ: మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై సచివాలయ కార్యదర్శులు వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో జగన్నాథపురం ఐదో సర్కిల్‌లో హాజరు కార్యాలయం వద్ద ధర్నా చేసిన సందర్భంగా మాట్లాడారు. మున్సిపల్ కార్మికులపై వ్యక్తిగత కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, సచివాలయ కార్యదర్శి రాజును సస్పెండ్ చేయాలని, మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై చులకనభావం తగదని అన్నారు. రాజు అనే కార్యదర్శి కార్మికుల పట్ల చులకన ప్రదర్శిస్తున్నారని, ఎదురుచెప్పినవారిని ఉద్యోగం నుంచి తొలగిస్తానని ఆందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. బండి అప్పన్న అనే కార్మికుడిపై వ్యక్తిగత కక్షతో విధుల నుంచి తొలగించారని, అతనిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయ కార్యదర్శులు మున్సిపల్ కార్మికులను గౌరవించకపోయినా, మహిళల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు చేపట్టినా కాకినాడలో అన్ని సర్కిళ్లలో ఉన్న మున్సిపల్ కార్మికులు పనులు నిలిపివేసి న్యాయం జరిగే వరకు పోరాడతామని ప్రసాద్ అన్నారు. ఈ ధర్నాలో నగర పాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక సందడి

- అపురూపంగా దశావతార వేంకటేశ్వర ఆలయ నిర్మాణం
- 30న విగ్రహాల ప్రతిష్ఠ



చీడిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయం

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో శనివారం నుంచి ఆధ్యాత్మిక సందడి మొదలు కానుంది. గ్రామంలో దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం పూర్తవ్వడంతో ఈనెల 30న విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. శనివారం నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. గ్రామ నాయకుడు కొప్పిశెట్టి గణేష్ మాట్లాడుతూ చీడిగలో గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రభుత్వం నుంచి రూ.70లక్షలు మంజూరు చేశారన్నారు. గ్రామస్తులు, భక్తులు, దాతల సహకారంతో సుమారు రూ.2.5కోట్లతో ఆలయ నిర్మాణం అత్యంత సుందరంగా చేపట్టామన్నారు. 30న ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు విగ్రహాలను ప్రతిష్ఠిస్తారని తెలిపారు.

వైభవంగా ఆలయ పునఃప్రారంభం



ఆలయంలో శ్రీకృష్ణ భగవానుని దర్శించుకుంటున్న భక్తులు

కరప: మండలం అరట్లకట్ట గ్రామంలోని యాదవులవీధిలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తులు సీతారామచంద్రస్వామి ఆలయాన్ని పునర్నిర్మించి శుక్రవారం ప్రారంభించారు. సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత రాములవారు, శ్రీకృష్ణ భగవానుని విగ్రహాలను అంబాజీపేట మండలం మొసలపల్లి వాస్తవ్యులు శైవాగమ పండిత, శైవాగమ ప్రతిష్ఠాచార్య, బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి వేద పండితులతో కలసి పూజలు, హోమాలు నిర్వహించి ప్రతిష్ఠించారు. పెయ్యల సత్యనారాయణ, అచ్చియ్యమ్మ దంపతులు, పి.శ్రీనివాస్, లక్ష్మి దంపతులు ఇచ్చిన విరాళంతో అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త కందిర్ల కాశీ, ఆలయ నిర్మాణకమిటీ సభ్యులు మందాల తాతీలు, కందిర్ల వీరబాబు, చెవల స్వామి, పెయ్యిల మరిడియ్య, గోపాలకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సర్పంచ్ గోపి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు సోడగం సూరిబాబు, పెంకే సత్తిబాబు, గోపి గణేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.